క్లుప్తంగా

బాధిత కుటుంబానికి పరామర్శ



సతీష్‌రెడ్డిని పరామర్శిస్తున్న ఎమ్మెల్యే శంకరనారాయణ

రొద్దం: మండల పరిధిలోని చిన్నగువ్వలపల్లికి చెందిన బాబిరెడ్డి కుమారుడు, ఉప సర్పంచ్ అనిల్‌రెడ్డి అన్న సతీష్‌కుమార్‌రెడ్డి ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. ఆస్పత్రిలో వైద్యం అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న బాధితుడిని ఎమ్మెల్యే శంకరనారాయణ మంగళవారం పరామర్శించారు. అలాగే అదే గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు రామకృష్ణారెడ్డి కుమారుడి వివాహానికి హాజరైన వధూవరులు వంశీకృష్ణ, కావ్యలను ఆశీర్వదించారు.

ఘనంగా నాగుల చవితి



రొళ్ల : బీజీ హళ్లిలో నాగుల విగ్రహానికి పూజలు చేస్తున్న భక్తులు

అమరాపురం/రొళ్ల: అమరాపురం, రొళ్ల మండలాల్లోని అన్ని గ్రామాల్లో సోమవారం వినాయక చవితి వేడుకలను పురస్కరించుకొని నాగుల చవితి సందర్భంగా నాగుల విగ్రహాలకు భక్తులు పూజలు చేశారు. అనంతరం బంధుమిత్రులను ఇంటికి పిలిచి అన్నదానం చేశారు.

కోనేరు శుభ్రం చేయించండి




గుడ్డం కోనేరును పరిశీలిస్తున్న మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్

హిందూపురం: గుడ్డం కోనేరును పట్టణ గణేష్ నిమజ్జన కార్యక్రమానికి అనుకూలంగా శుభ్రం చేసి అవసరమైన చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ప్రమోద్‌కుమార్ తెలిపారు. మంగళవారం గుడ్డం కోనేరును కమిషనర్ పరిశీలించారు. ప్రజలు ఇళ్లలో కొలువుదీర్చిన చిన్న గణపతుల నిమజ్జనం సందర్భంగా విగ్రహాలు, పూలు, ఇతర పూజా సామగ్రి వేశారని, వాటిని త్వరితగతిన శుభ్రం చేయించాలని అధికారులను ఆదేశించారు. విగ్రహాలను క్రేన్ ద్వారా కోనేరులో నిమజ్జనం చేయడానికి అనుకులంగా అన్ని చర్యలు తీసుకోవాలన్నారు.

ఆర్బీకే ఇన్‌చార్జ్‌కు గాయాలు

అగళి: మండల పరిధిలోని ఇనగలూరు రైతు భరోసా కేంద్రం ఇన్‌చార్జ్ జాన్‌పాల్ రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డారు. మంగళవారం ఇనగలూరు రైతు భరోసా కేంద్రం నుంచి గ్రామాల్లో రైతులు సాగుచేసిన ఈ క్రాప్ బుకింగ్ నమోదుకు ద్విచక్ర వాహనంలో వెళుతుండగా మరో వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి కిందపడ్డారు. తీవ్రంగా గాయపడిన జాన్‌పాల్‌ను కర్నూలుకు తరలించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు



ప్రమాద హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేస్తున్న పోలీసులు

లేపాక్షి: హిందూపురం డీఎస్పీ కంజాక్షన్ ఆదేశాల మేరకు హిందూపురం రూరల్ సీఐ వేణుగోపాల్, ఎస్‌ఐ మునీర్‌అహమ్మద్ ఆధ్వర్యంలో మంగళవారం మధ్యాహ్నం లేపాక్షిలో జాతీయ రహదారి కూడలిలో ప్రమాదల నివారణకు చర్యలు తీసుకున్నారు. గలిబిపల్లి క్రాస్, పిల్లిగుండ్లు కాలనీ సమీపంలో ఉన్న కూడలిలో ప్రమాదాలు జరుగకుండ హెచ్చరిక బోర్డులతో పాటు రేడియం స్టిక్కర్లను అతికించి ప్రయాణికులకు తగిన సూచనలు ఇచ్చారు.

నూతన పింఛన్ల పంపిణీ



లబ్ధిదారులకు నూతన పింఛన్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

మడకశిర: పట్టణంలోని సాయినగర్ వార్డు సచివాలయం పరిధిలోని 15, 16, 17వవార్డులకు చెందిన 18 మంది వృద్ధాప్య, డప్పు కళాకారులకు కౌన్సిలర్ సుభద్ర తదితరులు నూతన పింఛన్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ నాగేంద్ర, మాజీ కౌన్సిలర్ నారాయణప్ప, సచివాలయం కన్వీనర్లు గోపి, రాజశేఖర్, అంజలి తదితరులు పాల్గొన్నారు.

మహా గణపతిం భజే !

- వాడవాడలా కొలువైన గణనాథులు
- ప్రత్యేక పూజలు నిర్వహించిన భక్తులు


సాక్షిబృందం: హిందూపురం, పెనుకొండ, మడకశిర నియోజకవర్గంలోని అన్ని ప్రాంతాల్లోనూ వినాయక చవితి వేడుకలు అంబరాన్నంటాయి. ఊరూ, వాడా వినాయక సందడి నెలకొంది. ఏ వీధిలో చూసినా వివిధ రూపాల్లో కొలువు దీరిన గణపయ్య ప్రతిమలే దర్శనమిస్తున్నాయి. ఇళ్లలో భక్తిశ్రద్ధలతో వినాయక చవితి వ్రతాలను ఆచరించారు. ప్రత్యేకమైన వంటకాలను తయారు చేసి ఆది దేవునికి నైవేద్యంగా సమర్పించారు. సోమవారం ఉదయం నుంచే గణేషుడి ఆలయాలతో పాటు మంటపాలన్నీ భక్తులతో సందడిగా మారాయి.



హిందూపురం: వినాయకుడిని దర్శించుకుంటున్న ఆగ్రోస్ చైర్మన్ నవీన్‌నిశ్చల్



మడకశిర: అంబేడ్కర్‌సర్కిల్‌లో కొలువుదీరిన గణనాథుడు



హిందూపురం: మండీబజారులో కొలువుదీరిన మహాగణపతి



రొళ్ల: కొలువుదీరిన వినాయకుడు



హిందూపురం: వీడీ రోడ్డులో పూజలందుకుంటున్న గణపతి



హిందూపురం: ముక్కిడిపేటలోని సిద్ధిగణపతి



పరిగిలో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహం



చిలమత్తూరు: మరువకొత్తపల్లిలో కొలువు దీరిన వినాయకుడు



హిందూపురం: వినాయక ప్రతిమల నిమజ్జనంతో కిటకిటలాడుతున్న గుడ్డం కోనేరు



రొళ్ల : టీడీ పల్లిలో బసవన్నపై కొలువుదీరిన బొజ్జ గణపయ్య



మడకశిర: డ్రైవర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటైన గణపయ్య



మడకశిర: సదాశివాపురం కాలనీలో కొలువుదీరిన ఆదిదేవుడు



అమరాపురం: గణపతి నిమజ్జనానికి తరలిస్తున్న దృశ్యం

అవినీతి పరుడికి మద్దతిస్తూ రిలే దీక్షలా?

- టీడీపీ శ్రేణుల తీరుపై వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక ఆగ్రహం



మాట్లాడుతున్న హిందూపురం వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త టీఎన్ దీపిక

హిందూపురం: స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణంలో రూ.వందల కోట్లు అవినీతికి పాల్పడిన కేసులో టీడీపీ అధినేత చంద్రబాబును అరెస్టు చేయడాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని హిందూపురం వైఎస్సార్‌సీపీ నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్.దీపిక అన్నారు. సోమవారం స్థానిక వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అవినీతికి పాల్పడిన చంద్రబాబుకు మద్దతుగా టీడీపీ నాయకులు రిలే నిరాహార దీక్షలు చేస్తుండటంతో ప్రజలు విస్మయం చెందుతున్నారని చెప్పారు. ఒక్క స్కిల్ డెవలప్‌మెంట్ కేసులోనే కాకుండా అనేక వ్యవహారాల్లో చంద్రబాబు అవినీతికి పాల్పడ్డారని, త్వరలోనే అవి కూడా బయట పడటం ఖాయమన్నారు. కొన్ని వ్యవస్థలను అడ్డుపెట్టుకొని నీతిపరుడి ముసుగులో ఇన్నాళ్లు ప్రజలను మభ్యపెట్టారని విమర్శించారు. పాపం పండటంతో ఆధారాలతో సహా దొరికిపోయాడని, ఇక కోర్టు శిక్ష నుంచి తప్పించుకోలేరన్నారు. మరో పక్క లోకేష్ యువగళమంటూ ఇన్నాళ్లు పాదయాత్ర చేసి తండ్రి అవినీతికేసులో అరెస్ట్ అయితే తన స్వప్రయోజనాల కోసం పాదయాత్రను పక్కనపెట్టి తండ్రిబాటలోనే వ్యవస్థలను ఎలా మేనేజ్ చేయాలన్న ప్రయత్నాల్లో ఉన్నారన్నారు. లోకేష్ చేసిన అవినీతి పనులు కూడా త్వరలోనే బయట పడతాయన్నారు.

దత్తపుత్రుడే ఎక్కువ స్పందిస్తున్నారు

చంద్రబాబు అరెస్టు వ్యవహారంలో సొంత పుత్రుడి కంటే దత్తపుత్రుడు పవన్ కళ్యాణ్ ఎక్కువగా స్పందిస్తున్న తీరు చూస్తూ ప్రజలు ముక్కున వేలేసుకుంటున్నారని పేర్కొన్నారు. చంద్రబాబును జైల్లో కలిసి టీడీపీకి మద్దతిస్తూ, ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తామని నిస్సిగ్గుగా అవినీతికి మద్దతు ప్రకటించేశాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్ కళ్యాణ్ గత ఎన్నికల్లో రెండుచోట్ల పోటీ చేసి ఘోరంగా ఓడిపోయిన సంగతి మరచిపోకూడదని, సింగల్‌గా పోటీ చేసినా, టీడీపీతో జతకట్టి పోటీ చేసినా ప్రజలు వాళ్లను నమ్మే పరిస్థితిలేరని విమర్శించారు.

బాలకృష్ణ మళ్లీ గెలవలేడు

నందమూరి బాలకృష్ణ కూడా వచ్చే అసెంబ్లీ ఎన్నికలలో హిందూపురం నుంచి పోటీచేసినా గెలవలేడన్నారు. ఆయన రెండుసార్లు గెలిచిని హిందూపురానికి ఏమీ చేసిందిలేదని ప్రజలు అర్థం చేసుకున్నారని చెప్పారు. కనీసం ప్రజలను పలకరించడానికి తీరికలేని ఎమ్మెల్యే రాష్ట్రంలో బాలకృష్ణ ఒక్కరే ఉన్నారని విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో టీడీపీ, జనసేన పార్టీలు ఘోరంగా ఓడిపోయి పార్టీ కార్యాలయాలు మూసుకొనే పరిస్థితి కచ్చితంగా వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి, ప్రజా సంక్షేమ పథకాలను చూసి ప్రజలు రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని భారీ మెజార్టీతో గెలిపించడం ఖాయమన్నారు.

ముస్లింల అభ్యున్నతికి కృషి



మైనార్టీ నాయకులతో మాట్లాడుతున్న వేణురెడ్డి

హిందూపురం: వైఎస్సార్‌సీపీకి ముస్లిం మైనార్టీ ప్రజలు వెన్నుముకలాంటి వారని హిందూపురం నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ నాయకుడు వేణురెడ్డి అన్నారు. మంగళవారం మాజీ ఎమ్మెల్యే అబ్దుల్‌ఘనీ, మున్సిపల్‌వైస్ చైర్మన్ జబీవుల్లాతో కలసి పట్టణంలో పలువురు మైనార్టీ నాయకుల ఇళ్లకు వెళ్లి వారి అతిథ్యం స్వీకరించారు. ముస్లిం, మైనార్టీల అభ్యున్నతికి కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు బాషా, ఫారూక్, సానేముత్తవల్లి ఖాలీం, నాయకులు ఆర్‌కే ఖలీల్, రవూఫ్, తల్హాఖాన్, చందూ,ఇబ్రహీం, బాబా, షఫీ, అక్బర్, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

రొద్దం: మండలంలో ఖాళీగా ఉన్న గ్రామ వలంటీర్ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 26 లోపు అర్హులైన అభ్యర్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. 18 సంవత్సరాలు నిండి 35 ఏళ్ల లోపు వారు, పదోతరగతి ఉత్తీర్ణలైన వారు అర్హులన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 27న ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.

నిమజ్జనం ప్రశాంతంగా జరుపుకోవాలి



ముళ్ల పొదలు లేకుండా శుభ్రం చేస్తున్న దృశ్యం

సోమందేపల్లి: మండల వ్యాప్తంగా బుధవారం జరిగే నిమజ్జన కార్యక్రమం ప్రశాంతగా జరుపుకోవాలని ఎస్‌ఐ విజయ్‌కుమార్ సూచించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ నిమజ్జనం సందర్భంగా ఘర్షణలు, వివాదాలకు తావు ఇవ్వకుండా ప్రశాంతంగా జరుపుకోవాలని ఎస్‌ఐ సూచించారు. అలాగే మండల కేంద్రమైన సోమందేపల్లిలోని నిమజ్జనానికి సంబంధించి ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు.

కట్టుదిట్టంగా భద్రతా ఏర్పాట్లు

హిందూపురం అర్బన్: వినాయక చవితిని పురస్కరించుకొని పట్టణంతో పాటు నియోజకవర్గ వ్యాప్తంగా 300లకు పైగా వినాయక విగ్రహాలు ఏర్పాటు చేశారు. బుధవారం, శనివారాల్లో పట్టణ శివారు ప్రాంతాల్లో మండల కేంద్రాలు, గ్రామాల్లో ఏర్పాటు చేసిన విగ్రహాలను నిమజ్జనం చేయనున్నారు. ఇందులో భాగంగానే ప్రశాంత వాతావరణంలో నిమజ్జనం చేసుకోవాలని డీఎస్పీ కంజాక్షన్ తెలిపారు. హిందూపురం పట్టణంలో ఆదివారం నిమజ్జనం ఉంటుందని, గతంలో జరిగిన తప్పిదాలు జరగకుండా త్వరితగతిన విగ్రహాలు కదిలించి నిమజ్జనం చేసేలా ఏర్పాటు చేస్తున్నామన్నారు. కట్టుదిట్టంగా పోలీసు బందోబస్తు కల్పించేలా చర్యలు చేపట్టామన్నారు.

పకడ్బందీగా ఈ క్రాప్ బుకింగ్



లేపాక్షిలో ఈ క్రాప్ బుకింగ్ పరిశీలిస్తున్న ఏఓ

లేపాక్షి: మండల వ్యాప్తంగా ఈ క్రాప్ బుకింగ్ పకడ్బందీగా చేపట్టాలని వ్యవసాయాధికారిని శ్రీలత పేర్కొన్నారు. మంగళవారం ఉదయం మండలంలోని పులమతి గ్రామంలో జరుగుతున్న ఈ క్రాప్ బుకింగ్‌ను ఆమె పరిశీలించారు. ఈనెల ఆఖరి లోపు ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు.

అమరాపురం: మండలంలోని రైతులు సాగు చేసిన పంటలను ఈ క్రాప్ బుకింగ్ చేసుకోవాలని ఏఈఓ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని వలస గ్రామంలో రైతు ప్రశాంత్ సాగు చేసిన అరటి పంటను ఈ క్రాప్ నమోదు చేశారు. ఈ సందర్భంగా ఏఓ మంజునాథ, ఏఈఓ అమర్నాథ్‌రెడ్డి మాట్లాడుతూ మండలంలోని వివిధ గ్రామంలో రైతులు ఖరీఫ్‌లో సాగు చేసిన వివిధ రకాల పంటలను సంబంధిత గ్రామ సచివాలయంలోని వీఏఏ, విహెచ్‌ఏలకు లేదా వలంటీర్లకు సమాచారం అందించి క్షేత్ర స్థాయిలో పంట వద్దకు వెళ్లి పంట నమోదు చేసుకోవాలన్నారు. ఈ నెల 30వ తేది లోపు ప్రతి ఒక్కరూ పంట నమోదు చేసుకోవాలని సూచించారు.

సస్యరక్షణ పద్ధతులు పాటించాలి

మడకశిరరూరల్: మండల పరిధిలోని మణూరు పంచాయతీలో మంగళవారం ఏఓ తిమ్మప్ప ,ఆర్బీకే సిబ్బందితో కలిసి మొక్కజొన్న పంటకు సోకిన తెగుళ్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ మొక్కజొన్న పంటకు కత్తెర పురుగు ఆశించిందని దాని నివారణకు సస్యరక్షణ పద్ధతులు పాటించాలని రైతులకు సూచించారు.

మద్యం కేసులో ఏడాది జైలు

పెనుకొండ రూరల్: అక్రమంగా కర్ణాటక మద్యాన్ని తరలిస్తూ 2021 సంవత్సరంలో రొద్దం మండలం సానిపల్లికి చెందిన రంగప్ప అనే వ్యక్తి పట్టుబడినట్లు సీఐ వెంకట సుబ్బారెడ్డి తెలిపారు. ఈ నేపథ్యంలోనే నేరం రుజువు కావడంతో రంగప్పకు సంవత్సరం పాటు సాధారణ జైలు శిక్షతో పాటు రూ.16,862 జరిమానా విధిస్తూ న్యాయమూర్తి మూజీబ్ పసపాల సయ్యద్ మంగళవారం తీర్పు వెల్లడించారన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం



బాధిత కుటంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న యునియన్ నాయకులు

రొద్దం: చెన్నేకొత్తపపల్లి చెందిన డ్రైవర్ చాంద్‌బాషా, దొమ్మితమర్రి గ్రామానికి చెందిన డ్రైవర్ ఫక్రోద్దీన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ డ్రైవర్స్, క్లీనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బాధిత కుటుంబాలకు రూ.40 వేలు ఆర్థిక సాయం అందించినట్లు డ్రైవర్ల యునియన్ రాష్ట్ర కార్యదర్శి రొద్దం మసూద్ అలీ తెలిపారు.

మహాలక్ష్మికి ప్రత్యేక పూజలు

రొళ్ల: రత్నగిరిలో వెలసిన కొల్హాపురి మహాలక్ష్మీదేవి ఆలయంలో మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున అమ్మవారికి అభిషేకం, అంకురార్పణ, కుంకుమార్చన, తులసీ పూజ, గంధాభిషేకం తదితర పూజలు చేశారు.

నేడు గోరంట్లలో 'జగనన్నకు చెబుదాం'

గోరంట్ల: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యల సత్వర పరిష్కారం కోసం జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. ఇందులో భాగంగా బుధవారం గోరంట్ల మండల పరిషత్ కార్యాలయంలో ఉదయం 9.30 గంటల నుంచి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని అధికారులు నిర్వహించనున్నారు. జగనన్న చెబుదాం కార్యక్రమంలో కలెక్టర్ అరుణ్‌బాబుతో పాటు జిల్లా స్థాయి అధికారులు పాల్గొంటారని ఎంపీడీఓ రఘునాథగుప్తా తెలిపారు.

విరగ్గాసిన వేరుశనగ



రొద్దం: మండల పరిధిలోని కంబాలపల్లికి చెందిన రైతు గుర్రమ్మ గారి సన్నాయప్ప సాగు చేసిన వేరుశనగ విరగ్గాసింది. తనకున్న నాలుగు ఎకరాల పొలంలో గుజరత్ గోల్డ్ అనే రకం సాగు చేసినట్లు రైతు తెలిపారు. నాలుగు ఎకరాలకు 2.50 క్వింటాళ్లు విత్తనం సాగు చేశానని పేర్కొన్నారు. 4 ఎకరాలకు పెట్టుబడి రూ. 60 వేలు అయిందన్నారు. ఒక్కో మొక్కకు 130 నుంచి 150 దాకా కాయలు కాశాయన్నారు. నాలుగు ఎకరాలకు దాదాపు 90 బస్తాలు దిగుబడి వస్తుందని రైతు ఆశాభావం వ్యక్తం చేశారు.

ఆరోగ్య భద్రతే 'జగనన్న ఆరోగ్య సురక్ష 'లక్ష్యం



జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం టోకెన్లను అందిస్తున్న దృశ్యం

పరిగి: ప్రజలందరికీ మెరుగైన ఆరోగ్యాన్ని కల్పించడమే జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమ లక్ష్యమని పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ స్వరూపరెడ్డి, డాక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. సోమవారం సీతారామపురంలో జగనన్న ఆరోగ్య కార్యక్రమంలో భాగంగా సర్వే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారి వివరాలతో పాటూ సాధారణ వ్యాధులపై ఆరా తీశారు. అనంతరం ప్రత్యేక యాప్‌లో వివరాలు నమోదు చేశారు. అనంతరం ఎంపీపీ సవిత చేతుల మీదుగా జగనన్న ఆరోగ్య సురక్ష టోకెన్లను పీహెచ్‌సీలో వైద్యారోగ్య సిబ్బందికి అందించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా బీసీ సెల్ కార్యదర్శి ప్రభాకర్, సీహెచ్‌ఓ వన్నప్ప, వైద్యారోగ్య సిబ్బంది పాల్గొన్నారు.